# మతతత్వశక్తుల అసలు స్వరూపాన్ని వెల్లడిచేసిన నిజనిర్ధారణ బృంద నివేదిక

**(నదీమ్‌ఖాన్(సామాజిక కార్యకర్త), ప్రశాంత్ టాండన్(జర్నలిస్టు), హస్నుల్‌బన్నా(జర్నలిస్టు), తారిఖ్‌అన్వర్(జర్నలిస్టు), కిస్సు(జర్నలిస్టు), మహతాబ్ ఆలం(సామాజిక కార్యకర్త), మరియు ఫర్రా షకీబ్(సామాజిక కార్యకర్త)లతో కూడిన 'ది యునైటెడ్ ఎగనెస్ట్ హేట్' (విద్వేషానికి వ్యతిరేకంగా సమైక్యం) పేరుతో ఓ నిజనిర్ధారణ బృందం-ఈ సం॥రం రామనవమి చుట్టూ బీహార్‌లో సాగిన మతతత్వహింస అనంతరం ఆ ప్రాంతాలలో పర్యటించింది. ఆ నిజనిర్ధారణ బృంద నివేదికనుండి కొన్ని భాగాలను ఇక్కడ అందిస్తున్నాం. - సంపాదకుడు)**

**బీహార్‌లో** మార్చి 25న ప్రారంభమైన మతతత్వ హింస మార్చి 30 వరకు కొనసాగింది. బీహార్ రాష్ట్రంలోని 38 జిల్లాలకుగానూ, 9 జిల్లాలలో-భగల్‌పూర్, మంగెర్, సమస్తిపూర్, సివాన్‌గయ, ఔరంగబాద్, కైమూర్, నవద, నలందలలో-ఈ మతతత్వ హింస ఒక జిల్లానుండి మరొక జిల్లాకు వ్యాపించింది. రామనవమి ఊరేగింపుల సందర్భంగా చెలరేగిన ఈ ఘర్షణల్లో ఒక వ్యక్తి చనిపోగా, దాదాపు 65 మంది గాయపడ్డారు.

ఈ అల్లర్లతో సంబంధమున్న పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో పదిమందికిపైగా బిజెపి కార్యకర్తలు (వీరిలో మోహన్‌పట్వా, దినేష్‌కుమార్ ఝా అనే ఇద్దరు సీనియర్ బిజెపి నాయకులతోసహా) వున్నారు. కేంద్రమంత్రి అశ్వనీ కుమార్ చౌబె తనయుడు అరిజిత్ శాశ్వత్- భగల్‌పూర్‌లోని నాథ్‌నగర్‌లో హింసను ప్రేరేపించి నందుకుగానూ ఏప్రిల్ 1న జైలులో నిర్బంధించ బడ్డాడు. ఆనాడు జరిగిన ఆ అల్లర్లలో, అక్కడ జరిగిన భారీ రాళ్ళ దాడిలో, దొమ్మీలో ఇద్దరు పోలీసులతో సహా అనేకమంది గాయపడ్డారు. హింసానంతరం పోలీసులు సమర్పించిన రెండు ప్రాథమిక దర్యాప్తు నివేదిక(ఎఫ్ఐఆర్)లలో ఒక దానిలో శాశ్వత్ పేరు నమోదైవుంది. రాష్ట్ర రాజధాని పాట్నాలో హనుమాన్ దేవాలయంవద్ద పోలీసుల ముందు అతను లొంగిపోయాడు.

బీహార్‌లో ఈ మతతత్వహింస కార్చిచ్చులాగా భగల్‌పూర్ నుండి మరో 8 జిల్లాలలకు వ్యాపించింది. ఈనాటి వరకు మతసామరస్యానికి పేరుగాంచిన సమాజంలోని వాతావరణాన్ని నాశనం చేయటానికి మతతత్వశక్తులు చేసిన ప్రయత్నం ఇది.

పత్రికా కథనాల ప్రకారం ఒకరు హత్య గావించబడగా, ఈ మతతత్వదాడులలో ఈ జిల్లాలన్నింటిలో మొత్తం 65 మంది గాయపడ్డారు. ఇంకా అనేక దుకాణాలను అగ్నికి ఆహుతిచేశారు. అనేక వాహనాలను ధ్వంసంచేశారు. కత్తులను ప్రదర్శిస్తూ, కాషాయజెండాలను చేబూనిన ఓ అరాచక గుంపు రామనవమి ఊరేగింపు సందర్భంగా వినాశనానికి పాల్పడటంతో ఇది ప్రారంభమైంది. దాదాపు అన్ని జిల్లాలలోనూ ఆస్తుల విధ్వంసం భారీగా జరిగింది. ఈ జిల్లాలలోని అత్యధిక నియోజకవర్గాలలో బిజెపి అలాగే కాంగ్రెస్ పార్టీల నుండి కూడా ఎన్నికైన ప్రతినిధులుండగా, వీరంతా ఈ మతతత్వ ప్రచారంలో భాగస్వాములయ్యారు. 'యునైటెడ్ ఎగనెస్ట్‌హేట్' వేదికగా 2018 ఏప్రిల్ 3న ఓ సంయుక్త నిజనిర్ధారణ బృందం పాట్నా మరియు ఢిల్లీలనుండి బీహార్ వెళ్ళింది. ఈ బృందం మొత్తం పరిస్థితిని విశ్లేషించటంతోపాటు, ఈ ప్రాంతాలలో హింస ఎంత లోతుగా చొచ్చుకు పోయిందో పరిశీలించింది.

మతపరమైన పండుగలను రాజకీయపూరితం చేయటం, బాగా రెచ్చగొట్టే ఇస్లామ్ వ్యతిరేక పాటలు, బలవంతంగా దూసుకురావటం వంటి కారణాలే అంతిమంగా ఈ 9 జిల్లాలలోనూ మతతత్వ చిచ్చు రగలటానికి కారణాలుగా వున్నాయి. మతపరమైన సమీకరణకోసం మతపరమైన పండుగలను ఆర్ఎస్ఎస్, బిజెపి కార్యకర్తలు ఈనాడు అవకాశంగా తీసుకుంటున్నారు.

ఈ బృందం సందర్శించిన జిల్లాలన్నింటిలో దాదాపు ఈ పరిస్థితే వుంది. రామనవమి ఊరేగింపులు నిర్వహించటానికి నూతనంగా ఏర్పాటైన సంస్థలు జిల్లాపాలనా యంత్రాంగాన్ని అనుమతులు కోరటం, కొన్ని నిబంధనలు- షరతులకు లోబడి అధికారులు అనుమతి మంజూరుచేయటం జరిగింది. దీనికి భిన్నంగా -ముఖ్యంగా యువజనులు వందలాది మోటారు వాహనాలతో ప్రదర్శనలు నిర్వహించటం, కత్తులను ఇతర ఆయుధాలను ఝుళిపిస్తూ ప్రదర్శించటం, తీవ్ర అభ్యంతరకరమైన పాటలను వినిపించటం జరిగింది. నిబంధనలను-షరతులను ఉల్లంఘించి వారు ముస్లిములు అత్యధికంగా నివసించే ప్రాంతాలలోకి చొరబడే ప్రయత్నం చేసినపుడు, స్థానిక ముస్లిము ప్రజలు - దీనికి అభ్యంతరం తెలిపారు. ఫలితంగా రాళ్ళదాడి ప్రారంభమైంది; తర్వాత నిర్దిష్ట మతానికి చెందినవారి షాపుల విధ్వంసం, ఇతర ఆస్తులను అగ్నికి ఆహుతి చేయటం జరిగింది.

ఈ గుంపులు అధికసంఖ్యలో కత్తులు పట్టుకొని వున్నారనేది రెండువైపుల వారి వాదనల లోని సాధారణ ఆరోపణగా వుంది. రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి అమీర్‌సుభాని ఈ విషయాన్ని నిర్ధారించాడు కూడా. పదునైన అంచులు కలిగిన ఈ ఆయుధాలను కొరియర్ వ్యవస్థద్వారా బయటి ప్రాంతాలనుండి దిగుమతి చేసుకొని, ఈ జిల్లాలలో వారి అనుయాయులకు ఉచితంగా పంపిణీచేశారు.

బీహార్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి(హోంశాఖ) అమీర్ సుభానీని ఈ నిజనిర్ధారణ బృందం కలిసింది. ఊరేగింపులలో భారీసంఖ్యలో కత్తులు ప్రదర్శించారన్న విషయాన్ని ఆయన నిర్ధారించాడు. కత్తులను ప్రదర్శించటమనేది కొత్త ధోరణిగా వుందని, గతంలో ఎన్నడూ ఇలా చూడలేదని కూడా ఆయన పేర్కొన్నాడు.

ఈ మత హింస ప్రభావిత జిల్లాలన్నింటిలో దూషణలతోకూడిన, అత్యంత అభ్యంతకరమైన పాటలను నింపిన పెన్‌డ్రైవ్‌లు,

సిడీలను చాలా ముందుగానే పంపిణీ చేశారు. పాలనా యంత్రాంగమే కాకుండా రెండు మతాలకు చెందిన ప్రజలందరూ ఈ అంశాన్ని నిర్ధారించారు. మతహింస ప్రభావిత జిల్లాలలో లౌడ్‌స్పీకర్లద్వారా నిజనిర్ధారణ బృంద సభ్యులు కొన్ని పాటలను విన్నారు. ఇవన్నీ ఒక కేంద్రం నుండి ఉత్పత్తి అయినట్లుగా తెలుస్తోంది.

మత ఉద్రిక్తతలను రగిలించటానికి పథక రచన, గత ఆరునెలలుగా ఏర్పాట్లు సాగుతున్నాయని నివేదికలు కూడా సూచిస్తున్నాయి.

ఊరేగింపుల సందర్భంగా వినిపించిన పాటల లోని కొన్ని వాక్యాలను చూద్దాం:

'పాకిస్థాన్ మే భేజో యా ఖతమ్ కర్‌దాలో
ఆస్టీన్ కే సాన్‌పాన్ కో నా దూధ్ పిలాకర్ పాలో'
'జిస్‌దిన్ జాగ్ ఉఠా హిందూత్వతో యే అంజామ్ బోలేగా,
టోపీవాలా భీ సర్ ఝుకాకర్ జైశ్రీరామ్ బోలేగా'
'దర్ హట్ అల్లా వాలో, క్యున్ జన్మభూమీకోఘేరాహై
మస్‌జిద్ కహీ అవుర్ బనావో తుమ్, యే రామ్ లల్లాకా డేరాహై'

(పాకిస్థాన్ పంపండి లేదా చంపెయ్యండి; శత్రుత్వం కల్గివున్న పాములకు పాలుపోసి పెంచొద్దు; హిందూత్వం జాగృతమయ్యే రోజున టోపీలు ధరించేవాళ్ళు కూడా తలవంచి 'జై శ్రీరామ్' అని తప్పక నినదిస్తారు; దూరం జరగండి అల్లా సేవకులారా, ఇది శ్రీరామ జన్మభూమి; ఎందుకు జన్మభూమిని చుట్టుముడతారు? ఇది శ్రీరాముని నివాసస్థలం అల్లా భక్తులారా! మీరు మసీదును మరోచోట నిర్మించుకోండి'). వీటిలో అత్యధిక పాటలను దాదాపు ఒక సం॥రం క్రితమే యు- ట్యూబ్‌లో వుంచారు; లక్షలాదిమంది ఈ పాటలను వీక్షించారు. ఈ పాటలను సీడీలద్వారా, పెన్‌డ్రైవ్‌ల ద్వారా స్పష్టంగా అందరికీ అందజేసే ఉద్దేశ్యంతో సేకరించి, అనేక సంవత్సరాలుగా ప్రశాంతంగా వున్న ఈ ప్రాంతాలలో ఉద్దేశ్యపూర్వకంగా ఉద్రిక్తతలను రగిల్చే లక్ష్యంతోనే పంపిణీ చేశారు.

**ఔరంగాబాద్**

కైమూర్, గయలతోపాటుగా ఈ మతతత్వ హింసకు తీవ్రంగా దెబ్బతిన్న మూడవజిల్లా ఔరంగాబాద్. ఈ జిల్లాలో మతతత్వహింస మార్చి 25వ తేదీ సాయంత్రం బ్రద్దలైంది. దొమ్మీలకు పాల్పడిన వారు 31 దుకాణాలకు నిప్పుపెట్టారని అధికారిక గణాంకాలు తెల్పుతున్నాయి. అయితే స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం 50కి పైగా దుకాణాలు బూడిద కుప్పలుగా మారిపోయాయి. 25 మంది పైగా ప్రజలు గాయపడ్డారు.

రామనవమి ఊరేగింపులో భాగంగా వందలాదిమంది గుంపుగా చేరి, నవాడీరోడ్‌లోని ముస్లిము జనాభా అధికంగా వుండే క్వాజీ ముహల్లా ప్రాంతంలోకి బలవంతంగా చొరబడి వెళ్ళే ప్రయత్నం చేశారు. ద్విచక్ర వాహనాల ప్రదర్శన కారులు దీనికి ముందు వున్నారు. అభ్యంతరకర పాటలతో రెచ్చగొట్టటంతో ఆ ప్రాంతంలోని ప్రజలు ప్రదర్శనకారులను తమ ప్రాంతంలోకి ప్రవేశించ రాదని, మార్కెట్ మీదుగా నేరుగా వెళ్ళిపోవలసిందిగా కోరారు. వేడెక్కిన మాటల యుద్ధం తర్వాత, రెండు సమూహాల మధ్య రాళ్ళు విసురుకోవటం ప్రారంభమైంది.

చాలా పెద్ద నష్టం కలిగించింది. అనేక షాపులు దోపిడీకి గురయ్యాయి; ఆస్తులు లూటీ అయ్యాయి. స్థానికులొకరు ఈ సందర్భంగా చిత్రీకరించిన వీడియోను నిజనిర్ధారణ బృందం పరిశీలించి, అంచనాకొచ్చింది. ఆ ప్రాంతంలోని ముస్లిము స్మశానాన్ని కొందరు ఆక్రమించుకొని విజయం సాధించిన దానికి గుర్తుగా అక్కడ కాషాయరంగు జెండాలను ప్రతిష్ఠించి, 'జై శ్రీరామ్' అంటూ పెద్దగొంతులతో నినాదాలు చేస్తూవుండటం ఆ వీడియోలో కనిపించింది. ఈ హింసాత్మక గుంపు కాల్పులకు పూనుకున్నాయని, చేతి బాంబులను ఉపయోగించారని అన్నారు కానీ, అది నిర్ధారణ కాలేదు.

సిఆర్‌పిసి 144వ సెక్షను క్రింద నిషేధాజ్ఞలు విధించారు. పట్టణంలో పరిస్థితి ఉద్రిక్తంగావున్నా, పూర్తిగా అదుపులో వుంది.

ఔరంగాబాద్ పట్టణంలో రెండు రోజులపాటు చోటుచేసుకున్న మతతత్వ ఘర్షణలతో సంబంధ మున్న 150 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అంతర్జాల సేవలను నిరవధికంగా నిలిపివేశారు.

**నవడా**

స్థానిక మార్కెట్ ప్రాంతంలో మార్చి 28న ఒక పెద్ద ఊరేగింపు (రామనవమి పండుగ-మార్చి 25న) నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలను కూడా ఈ ప్రదర్శనలో పాల్గొనమని పిలుపునిచ్చారు. ఏమైనా అది ప్రశాంతంగా జరిగిపోయింది.

పత్రికా కథకాల ప్రకారం, హనుమంతుని గుడిలో విగ్రహం ధ్వంసం చేయబడి వుండటం అల్లర్లకు కారణమైంది. అయితే వాస్తవికంగా మరో కారణం తెలుస్తోంది. ఒక ముస్లిము వివాహం జరుగుతన్న కళ్యాణమండపానికి దగ్గరలో, సిమెంటు దిమ్మెపై హనుమంతుని విగ్రహమొకటి వుంది; దేవాలయం లేదు. రాత్రి 2 గంటల సమయంలో, ఆ హనుమంతుని విగ్రహాన్ని ధ్వంసం చేశారని ఆరోపిస్తూ ఒక గుంపు ఆ వివాహం జరిగే కళ్యాణ మండపంపైకి వెళ్ళారు.

ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం ముస్లిము వివాహానికి వచ్చిన వారెవరూ హనుమంతుని విగ్రహం జోలికి పోలేదు; అంతేగాదు, హనుమంతుని విగ్రహం ధ్వంసమైందనే విషయం కూడా వారికి తెలీదు. ఆగ్రహంతో వివాహమండపం మీదకు దూసుకెళ్ళిన ఆ గుంపు, ఆ మండపాన్ని తగులబెట్టే ప్రయత్నం చేసింది. మరునాడు మార్చి 27న నవడా జిల్లా కేంద్రంలో ఇస్లాము వ్యతిరేక నినాదాలతో ఓ గుంపు ప్రదర్శన నిర్వహించింది. ముస్లిములకు యాదవులకు నడుమ విభజన తెచ్చే కుట్రతో పథకం ప్రకారమే

దీనిని నిర్వహించారని ప్రత్యక్షసాక్షుల కథనం తెలుపుతోంది. దీని తర్వాత కూడా ముస్లిము యువతనుండి ఏవిధమైన ప్రతిచర్యలూ లేక పోవటంతో, ఆ గుంపు తమ మార్గంలోవున్న వాట న్నింటినీ ధ్వంసం చేస్తూ సాగింది. యాదృచ్ఛికంగా అక్కడొకరిని, ఇక్కడొకరిని పోలీసులు అరెస్టు చేస్తున్నారని ప్రజలు ఆరోపించారు. రెండు సమూహాలకు చెందిన 40 మందిపై ఇప్పటికి ఎఫ్ఐఆర్‌లు నమోదుకాగా, పేర్లు గుర్తించని మరో 200 మంది కూడా ఈ కేసుల్లో వున్నారు.

1. రామనవమి రాబోతున్నదనగా అక్కడ ఒక శాంతి సమావేశం జరుపుకొని అనుమతి తీసుకున్న వారు మాత్రమే ఊరేగింపులు నిర్వహించాలని నిర్ణయించారు.
2. ప్రదర్శనల్లో వినిపించవలసిన మతపరమైన పాటలు కలిగిన పెన్‌డ్రైవ్ ప్రభుత్వం వద్ద అందుబాటులో వుంటుంది.
3. రామనవమి పండుగ తర్వాత, ఎక్కడెక్కడైతే కాషాయజెండాలు ఎగురవేశారో వాట న్నింటినీ తొలగించాలి.

అయితే, క్షేత్రస్థాయిలో ప్రజలు చెప్పినదాని ప్రకారం, వీనిలో ఏ ఒక్కటీ అమలుకాలేదు. బయటి వాళ్ళు ప్రభుత్వ అనుమతి లేకుండానే ప్రదర్శనలో భాగస్వాములై, జైశ్రీరామ్ అనే నినాదాలు చేస్తూ రెచ్చగొట్టే ఇస్లాము వ్యతిరేక పాటలను వినిపించారు. పోలీసులు వీరిలో కొందరిపై కేసు నమోదు చేశారు తప్ప, ఈ కేసులను ఔరంగాబాద్, నవడావంటి చోట్ల ఆస్తుల విధ్వంసంతో సహా ఇదే తరహా పథకం ప్రకారం సాగిన హింస గురించి దర్యాప్తు జరపలేదు. బిజెపి స్థానిక నాయకులు ఈ ఘటనలలో పాల్గొన్నట్లుగా ప్రత్యక్షసాక్షులు పేర్కొంటున్నారు.

**రోసెరా(సమస్తిపూర్)నుండి ఓ ప్రత్యక్ష సాక్షి**

మానిష్ ఓ సామాజిక కార్యకర్త. ఓ స్టేషనరి దుకాణం నడుపుతున్నాడు. 28 సం॥ల తన జీవితంలో తానెన్నడూ ఇలాంటిది చూసివుండ లేదన్నాడు. 'మేము ఇక్కడ ఎల్లవేళలా ప్రేమతో, ఐక్యతతో జీవిస్తున్నాం. ప్రతి సం॥ రామనవమి ఊరేగింపు జరుగుతుంది. కానీ ఈసారి జరిగిన విధంగా గతంలో ఎన్నడూ జరగలేదు. దాదాపు 4000–5000 ప్రజాగుంపు, ప్రధానంగా యువకులు 'మదరసా'లోకి దూసుకెళ్ళి చదువుకునేందుకు వాడుకునే బల్లలు, కుర్చీలతోసహా కంటికి కనిపించే వాటినల్లా ధ్వంసంచేశారు. మదరసాలోపల నిలిపి వుంచిన వాహనాలకు సైతం వారు నిప్పు అంటించారు'.

"తమ గ్రామంలోని వారెవరూ ఈ ప్రదర్శనలో పాల్గొనలేదనీ ఇదంతా బయటవారు పథకంప్రకారం చేసిన పనే" అని మానిష్ ఆ తర్వాత నిర్ధారణ చేసుకున్నాడు.

**మేము డిమాండ్ చేస్తున్నాం**

- ఈ అల్లర్లను, గొడవలను ప్రేరేపించిన, ప్రోత్సహించిన, వీనిలో పాల్గొన్న ప్రభుత్వ అధికారులు, ఎన్నికైన ప్రతినిధుల జవాబుదారీ తనాన్ని నిర్ధారించాలి. అందరికీ కనువిప్పు కలిగే విధంగా నేరస్తులకు శిక్ష విధించాలి.
- బాధితులందరికీ పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలి.
- పథకం ప్రకారం సాగించిన హింస విషయంపై న్యాయవిచారణ జరిపించాలి.

oooo